క్లుప్తంగా

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



జర్రెలలో డ్రైనేజీ పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ భాగ్యవతి తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ కేంద్రంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ నాయకం భాగ్యవతి తదితరులు ఆదివారం శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యవతి మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.5లక్షలతో డ్రైనేజీ పనులు చేస్తున్నామన్నారు. డ్రైనేజీలు లేక వర్షం పడితే వీధుల్లో మురుగునీరు పారడంతో నడవడానికి ఇబ్బందిగా ఉందని, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను గతంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ మేరకు ఆమె స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. డ్రైనేజీ పూర్తవడంతో గిరిజనులకు రాకపోకలకు అవస్థలు తప్పాయన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రకు గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. వార్డు సభ్యులు పరుశురాం, నాగరాజు, సురేష్, రామరాజు, సీతమ్మ, భీమో, డోంబు తదితరులు పాల్గొన్నారు.

చాపరాయికి తగ్గిన పర్యాటకులు



చాపరాయి జలపాతం

డుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో ఆదివారం అంతంతమాత్రంగానే పర్యాటకులు వచ్చారు. బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా మన్యంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ శాఖ సూచనల మేరకు పర్యాటకులు రాలేదని నిర్వాహకులు తెలిపారు. మండలంలోని చాపరాయి జలపాతంతో పాటు పలుచోట్ల పర్యాటకుల తాకిడి కనిపించలేదు. దీంతో పర్యాటక ప్రదేశాలు బోసిపోయాయి. వాస్తవానికి వారంతంలో పర్యాటక ప్రాంతాలన్నీ కిటకిటలాడుతుంటాయి. అయితే ప్రస్తుతం తుపాను సూచనల నేపథ్యంలో పర్యాటకుల సంఖ్య కొంతమేర తగ్గినట్టు పలువురు చెబుతున్నారు. రానున్న కార్తీక మసంలో పర్యాటకుల తాకిడి పేరిగే అవకాశాలున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు.

సర్పంచ్ రాంబాబుకు ఘన సన్మానం



సర్పంచ్ సీదరి రాంబాబును సన్మానిస్తున్న బొడ్డుమామిడి గిరిజనులు

సాక్షి,పాడేరు: డి.గొందూరు పంచాయతీలోని మారుమూల ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న సర్పంచ్ సీదరి రాంబాబుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బొడ్డుమామిడి గ్రామానికి చెందిన ఆదివాసీలంతా ఆదివారం సర్పంచ్ రాంబాబుకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

గన్నెల సేకరణలో గిరిజన మహిళలు



గన్నెలను తీసుకెళ్తున్న గిరిజన మహిళలు

ముంచంగిపుట్టు: మండలంలో గిరిజన మహిళలు గన్నెల సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం సీజన్ కావడంతో గిరిజన మహిళలు అటవీ ప్రాంతం నుంచి సేకరించిన గన్నెలను ఎండపెట్టి, ఆకులు, పువ్వులు రాలిన అనంతరం కట్టలుగా కట్టి చీపుళ్లుగా తయారుచేస్తారు. గన్నెలతో తయారుచేసిన చీపుళ్లను ఇల్లు శుభ్రం చేయడానికి గిరిజనులు వినియోగించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం గిరిజన మహిళలు కొండ, అటవీ ప్రాంతాలకు వెళ్లి గన్నెల సేకరించడంలో గిరి మహిళలు నిమగ్నమయ్యారు.

చిరుధాన్యాలు.. ఆరోగ్య సిరులు



సాగులో ఉన్న కొర్రలు

- సిరిధాన్యాలు, పప్పుధినుసులకు గిరాకీ
- వారపు సంతల్లో పెరిగిన విక్రయాలు
- మైదాన ప్రాంతం నుంచి అధికంగా కొనుగోలు
- ఆర్థికంగా బలపడుతున్న గిరిజన రైతులు



సంతలో పప్పు ధినుసులు, చిరుధాన్యాలు విక్రయిస్తున్న గిరిజనులు



రాగి పంటను సేకరిస్తున్న గిరిజన మహిళ



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

ముంచంగిపుట్టు: చోడి అంబలి, రాగి సంగటి, జొన్న రొట్టెలు, రాజ్‌మా, కందులు, శనగలు, చిక్కుడు జాతి గింజల్లో పీచు, ప్రోటీన్లు దండిగా ఉంటాయి. గిరిజన ప్రాంతంలో గిరిజనులు ఆహారం వినియోగిస్తూ, అమ్మకాల కోసం ఎక్కువగా ఈ పంటలనే సాగుచేస్తున్నారు. వీటి వైపు మైదాన ప్రాంత వాసులు చూస్తున్నారు. ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. సామాన్యుల్లో సైతం ఆరోగ్య స్పృహ పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం సమాజంలో మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులు విజృంభిస్తున్నాయి. చిన్న వయసులోనే వీటి బారిన పడడం వంటి కారణాలతో అధిక శాతం మంది చిరుధాన్యాలు, పప్పుధినుసులు వైపు మొగ్గుచూపుతున్నారు. దీనికి తోడు చిరుధాన్యాల, పప్పుధినుసులు వల్ల కలిగే ప్రయోజనాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రతిరోజు ప్రచారం పెరుగుతూ ఉండడం వీటి ఆదరణను సైతం విపరీతంగా పెరుగుతూ వస్తుంది. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లు తప్పనిసరిగా మార్చుకోవాల్సి వస్తుంది. సమాజంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. దీనికి సాధారణంగా రక్తపోటు సైతం అధికమవుతుంది. ప్రస్తుతం ఆహారంగా తీసుకునే వాటి వల్ల అనుకున్న స్థాయిలో శక్తి మనిషికి రావడం లేదు. అయితే చిరుధాన్యాల వల్ల ఎంతో ఉపయోగమని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో చిరుధాన్యాల వినియోగం గతంలో కంటే బాగా పెరిగింది. మన్యంలో ఎటువంటి రసాయనాలు లేకుండా పండించే చిరుధాన్యాలకు గిరాకీ ఏర్పడింది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు చిరు ధాన్యాలు వినియోగించాలని వైద్యుల సూచనల మేరకు వీటి వినియోగం గణనీయమంగా పెరిగింది.

సంతల్లో జోరుగా చిరుధాన్యాల వ్యాపారం

గిరిజన ప్రాంతంలో గిరిజనులు పండించే ఏ ఉత్పత్తులైన ప్రధానంగా గిరిజన రైతులు విక్రయించేది వారపు సంతలే. ఎటువంటి ఎరువులు వాడకుండా సహజసిద్ధంగా గిరిజనులు చిరుధాన్యాలు, పప్పుధినుసుల పంటలను పండిస్తారు. దీంతో రాగులు, కొర్రలు, సామలు, జొన్న, రాజ్‌మా, శనగలు, కందులు వంటికి బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. రాగులు, కొర్రలు, రాజ్‌మాలకు వినియోగం ఎక్కువగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 22 మండలాల్లో జరిగే వారపు సంతల్లో ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులు వచ్చి అధికంగా కొనుగోలు చేస్తున్నారు.గత రెండేళ్లగా చిరుధాన్యాల, పప్పుదినుసులకు డిమాండ్ అమాంతం పెరిగింది. దీనికి ముఖ్య కారణం మైదాన ప్రాంతాల హోటళ్లు, ,రెస్టారెంట్‌లలో సైతం వీటిని ప్రత్యేక వంటకాలుగా అందుబాటులో ఉంచడంగా తెలుస్తుంది. రాగి జావ(రాగి మాల్ట్) అన్ని రకాల చిరు ధాన్యాలతో తయారు చేసిన (మల్టీగ్రేన్)తో జావలు, రొట్టెలు, రాజ్‌మా కూరలు వండుతున్నారు. వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పెద్ద పెద్ద మాల్స్‌లో, కిరాణా షాపుల్లో సైతం చిరుధాన్యాలు, పప్పుదినుసులను ప్యాకెట్ల రూపంలో అమ్మకాలు చేస్తున్నారు. మైదాన ప్రాంతంలో డిమాండ్‌తో గతంతో పోలిస్తే పంటల సాగును సైతం గిరిజనులు పెంచుతూ వస్తున్నారు. అల్లూరి జిల్లాలో 22 మండలాల్లో 1,32,756 మంది రైతులు చిరుధాన్యాలు, పప్పుదినుసుల పంటలను 2,93,191 ఎకరాల్లో పండిస్తున్నారు. ప్రభుత్వం, ఐటీడీఏల నుంచి రాయితీలను వినియోగించుకుంటూ గిరిజన రైతులు పంట దిగుబడి పెంచుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.మండలంలో సామలను-1048 ఎకరాల్లో, రాగులను- 3907 ఎకరాల్లో, రాజ్‌మాను-1400 ఎకరాల్లో పండిస్తున్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



ఆహార అలవాట్లలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. చిరుధాన్యాలు, పప్పుదధినుసులలో ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని తీసుకుంటున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో పండించే రాగులు, సాములు, రాజ్‌మా వంటికి బాగా డిమాండ్ పెరిగింది. వారపు సంతల్లో వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. దీంతో గిరిజన రైతులకు చిరుధాన్యాలు, పప్పుధినుసుల పంటల సాగుపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. దిగుబడితో పాటు ఆర్థికంగా లబ్ధి చేకూర్చే పంటల పండించాలని రైతులకు సూచిస్తున్నాం.

– ఎం. శ్రీనివాసబాబు, మండల వ్యవసాయశాఖాధికారి, ముంచంగిపుట్టు

ధరలు బాగున్నాయి



గడిచిన రెండేళ్ల నుంచి కొర్రలు, సామ, చోడి పంటలను పండిస్తున్నాను. గతంలో కంటే ఇప్పుడు చిరుధాన్యాలకు డిమాండ్ ఉంది. మన్యంలో సేంద్రియ పద్ధతిలో పండించే పంటలతో పాటు చిరుధాన్యాలకు మంచి మార్కెట్ ఉంది. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో ధరలు బాగున్నాయి. రానున్న రోజుల్లో పెరిగే అవకాశాలున్నాయి.

– కె.సుబ్బారావు, రైతు, తలబుతోట

ఉపాధి పనులకు భూమిపూజ



వాతంగిలో గుర్తించిన ఉపాధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజవొమ్మంగి: మండలంలో ఇప్పటి వరకు రూ.1.10 కోట్ల విలువైన ఉపాధి పనులను ప్రారంభించినట్టు ఏపీవో సురేష్‌కుమార్ తెలిపారు. మూడు పంచాయతీల్లో ప్రారంభమైన పనులను ఆయన ఆదివారం పర్యవేక్షించారు. ఇందులో భాగంగా అమీనాబాద్ పంచాయతీలో గోకులం, వాతంగిలో పుంత రోడ్డు, లోదొడ్డిలో మిని అమృతసరోవర్ పనులకు సర్పంచ్‌లు వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి, రామారావులు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఏపీవో సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు మొత్తం 33 పనులకు శంకుస్థాపనలు చేసినట్టు తెలిపారు. ఈ పనులను సంక్రాంతి లోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రతి శ్రమజీవికి పని కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



రాజవొమ్మంగి: మండలకేంద్రంలోని ఉద్యోగుల కాలనీ సమీపంలోని ఉమామహేశ్వరి అనే గృహిణి ఇంట ఆదివారం తెల్లవారుజామున విరబూసిన బ్రహ్మకమలాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇంటి పెరటిలో ఒకే కొమ్మకు 8 పూలు పూయడంతో స్థానికులు వీటిని ఆసక్తిగా చూస్తున్నారు. వీటిలో కొన్ని పూలను ఆమె స్థానిక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సమర్పించారు. ఒకేసారి ఎనిమిది బ్రహ్మకమలాలు పుష్పించడం ఆనందంగా ఉన్నట్టు ఆమె చెప్పారు.

మెరుగైన వైద్యం అందించాలి

– అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో రోగులతో మాట్లాడి ఆరోగ్య వివరాలు, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలని చెప్పారు.

27 నుంచి సత్య దీక్షలు



వెంకటరామయ్య

అడ్డతీగల: అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సత్య దీక్షలు ఈనెల 27 నుంచి మొదటి విడత ప్రారంభించనున్నట్టు పవన గిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రం ద్వారా ఏజెన్సీలోని 11 మండలాల భక్తులచే ఆ రోజు ఉదయం 8 గంటలకు మాలధారణ చేయించి దీక్షలు ప్రారంభిస్తామన్నారు. మొదటి విడత చేపట్టే దీక్ష 27 రోజులు ఉంటుందన్నారు. రెండవ విడత 18 రోజుల దీక్ష చేపట్టే వారికి నవంబర్ 6న మాలధారణ చేయిస్తామని, అలాగే 9 రోజులు దీక్ష తీసుకునే భక్తులకు నవంబర్ 14 న మాలధారణ చేస్తామన్నారు. మాలధారులకు గతంలో వలే దీక్ష మాల, పూజా పుస్తకం, స్వామి వారి ఫోటో, పురుషులకు రెండు జతల దుస్తులు క్లాత్, రెండు రుమాళ్లు, స్త్రీలకు రెండు చీరలు, రెండు రవికెల క్లాత్‌లు ఉచితంగా అందజేయనున్నట్టు చెప్పారు. దీక్ష చేపట్టాలనుకునే భక్తులు తమ ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 6302939374 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాజు

జి.మాడుగుల: మండల కేంద్రంలో సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ల శిక్షణ తరగతులు ఆదివారం జరిగాయి. ముందుగా జి.మాడుగుల పురవీధుల్లో శ్రీరామ నామ జపంతో భక్తులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మత్స్యరాస మత్స్యరాజు మాట్లాడుతూ హిందుత్వాన్ని, సనాతన ధర్మాన్ని అందరు పాటించాలని సూచించారు. ప్రజల భక్తిభావం పెంపొందించుకోవాలని కోరారు. గ్రామ కన్వీనర్లకు భవిష్యత్ కార్యచరణపై అవగాహన కల్పించారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దుశ్శర్తి ఎస్ఐ వెంకయ్య

వై.రామవరం: మండలంలోని సరిహద్దు గ్రామమైన వెదురునగరం గిరిజన విద్యా వికాస కేంద్రాన్ని దుశ్శర్తి ఎస్ఐ వెంకయ్య ఆదివారం సందర్శించారు. విద్యార్థులకు కేరీర్ గైడెన్స్, గంజాయి, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాల జోలికి పోవద్దన్నారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించి నేరస్తులు కావద్దన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఆరోగ్యానికి అతి ప్రమాదకరమైన డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించి గిరిజన ప్రాంతానికి మంచిపేరు తేవాలన్నారు. అనంతరం సన్మార్గంలో నడచి మంచి పేరు తీసుకొస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనపై సలహాలు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- కుటుంబ సభ్యులను గిరిజన సంఘ నేతల పరామర్శ
- రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి



మృతుడి కుటుంబాన్ని పరామార్శించిన గిరిజన సంఘ నాయకుడు సురేంద్ర తదితరులు

పెదబయలు: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సరిహద్దు మత్స్యగెడ్డలో నాటు పడవ మునిగి మృతి చెందిన కొర్ర వేణుగోపాల స్వామి కుటుంబాన్ని ప్రభుత్వం అండగా ఉండాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు. రోగుల గ్రామంలో ఆయన సంఘం నాయకులతో కలిసి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు వేణుగోపాలస్వామి తల్లితండ్రులు వృద్ధాప్యంలో ఉన్నారని కుటుంబానికి ఆయనే పెద్ద దిక్కని ఆయన మృతి బాధాకరమన్నారు. ప్రభుత్వం, ఐటీడీఏ పీవో స్పందించి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో సరిహద్దు గ్రామాల ప్రజలు నాటు బోట్ల ప్రయాణం ప్రమాదమని తెలిసిన గత్యంతరం లేక వినియోగించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి స్టీమర్ బోట్లు పంపిణీ చేయాలని కోరారు. సంఘం నాయకులు ధర్మన్న పడాల్, సునీల్‌కుమార్, వైస్ సర్పంచ్ గంగాధరం, సీఐటియూ నాయకుడు రామారావు పాల్గొన్నారు.

అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు



సంతలో అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరమణ

కొయ్యూరు: అడవి జంతువులను వేటాడేందుకు అడవులు, పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు. ఇది చాలా ప్రమాదాకరమని చెప్పారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సంతలో ఆయన ఆదివారం పర్యటించారు. గిరిజనులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను వేటాడడం పెద్ద నేరమన్నారు. జంతువుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగల వల్ల మనుష్యులు కూడా మృతి చెందుతున్న సందర్భాలున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ తీగలు అమర్చవద్దని, ఎక్కడైనా అమర్చినట్టు సమాచారం ఉంటే ఎంతటివారైనా వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయిని సాగు , రవాణా చట్ట రీత్యా నేరమన్నారు. వాటి జోలికి పోవద్దన్నారు. గిరిజనులు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనచోదకులు రహదారి భద్రతను అందరూ పాటించాలని కోరారు. వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ ఇతరత్రా వాహనపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ చేపడుతున్న సంకల్పం కార్యక్రమంపై ముద్రించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. మంప ఎస్ఐ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



అనంతగిరి బాలికల-2 పాఠశాలను పరిశీలిస్తున్న జడ్జి స్వర్ణలత

అనంతగిరి(అరకులోయ రూరల్): విద్యార్థుల సౌకర్యాల కల్పనపై నిర్వహక్కులు నిర్లక్ష్యం చేయవద్దని అరకులోయ కోర్టు జడ్జి స్వర్ణలత చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల-1, 2 పాఠశాల వసతి గృహాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనపై నిర్లక్ష్యం చేయవద్దని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలన్నారు. పాఠశాల వసతి గృహంలో పలు సమస్యలను గుర్తించినట్టు ఆమె తెలిపారు. ఆమె కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బరడ మార్గంలో కల్వర్టులో కూరుకుపోయిన టిప్పర్

ముంచంగిపుట్టు: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు బరడ పంచాయతీ కేంద్రానికి వెళ్లే మార్గంలో డైనిజోలా మలుపు వద్ద కల్వర్టు కోతకు గురైంది. ఆదివారం ఇసుకలోడ్‌తో బరడ వెళ్తున్న టిప్పర్ కోతకు గురైన కల్వర్టుపై నుంచి వెళ్లడంతో అకస్మాత్తుగా భారీ వాహనం ఒక్కసారిగా కూరుకపోయింది. టిప్పర్ వెనుకభాగంలోని చక్రాలు గోతులో ఉండిపోయి ముందు భాగం కొంతమేర పైకి లేచింది. టిప్పర్‌లో ఉన్న ముగ్గురు వాహనం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కల్వర్టు గోతులో కూరుకుపోయిన టిప్పర్ రహదారికి అడ్డంగా ఉండిపోవడంతో బరడ నుంచి లబ్బూరుకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న బరడ పంచాయతీ సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు నబ్బోలు హుటాహుటీనా వెళ్లి స్థానికుల సహాయంతో కల్వర్టు గోతులో ఇరుక్కుపోయిన టిప్పర్‌ను బయటకు తీయించారు. వాహనాల రాకపోకలకు మార్గం సుగుమం చేశారు. పంచాయితీరాజ్ అధికారులు స్పందించి నూతన కల్వర్టును మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పర్యాటక ప్రాంతాల్లో మద్యం, ప్లాస్టిక్ నిషేధం

- ఘాట్ రోడ్డులో చెక్‌గేటు ఏర్పాటు



చెక్‌గేటును ప్రారంభించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, పాడేరు: మండలంలో పర్యాటక ప్రాంతం డల్లాపల్లిలో మద్యం, ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ గిరిజనులు నిర్ణయం తీసుకున్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతాల నాగేశ్వరరావు పిలుపు మేరకు డల్లాపల్లి హిల్స్ అండ్ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గెమ్మెలి బొంజుబాబు అధ్యక్షతన ఆదివారం గిరిజనులతో సమావేశం జరిగింది. ఇందులో భాగంగా సలుగు సర్పంచ్ అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ నేత దూసరి గంగరాజులు డల్లాపల్లి ఘాట్ రోడ్డులో చెక్‌పోస్టును ప్రారంభించారు. పర్యాటకుల వాహనాలు మద్యం సీసాలు, ప్లాస్టిక్ బాటిళ్లతో డల్లాపల్లి ప్రాంతానికి రాకుండా స్థానికులు ఈ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేయనున్నట్టు తెలిపారు. సర్పంచ్ అప్పలకొండ మాట్లాడుతూ డల్లాపల్లి పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటకులంతా గిరిజన హక్కులు, చట్టాలను గౌరవించాలన్నారు. పర్యాటకులంతా పర్యావరణ హితంగా ఉండి, ఇక్కడ ప్రకృతిని ఆస్వాదించాలని ఆయన కోరారు.

22 నుంచి ఆధార్ డ్రైవ్

అరకులోయ రూరల్: బస్కీ, గన్నెల, పద్మాపురం సచివాలయం-2, పెదలబుడు సచివాలయం-3 పరిధిలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లవరాజు తెలిపారు. ఆధార్ సీడింగ్, పేరులోని మార్పు చేర్పులు వివిధ రకాల అవసరమైన పనులు చేసుకోవచ్చన్నారు. డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.